క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: శివరాంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ రాఘవేంద్ర కాలనీ ఫీడర్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నామన్నారు. ఫీడర్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో కోత ఉంటుందని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

కేంద్ర మంత్రికి సత్కారం



కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌ను ఆదివారం రాజేంద్రనగర్ బీజేపీ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. రాజేంద్రనగర్ ఎన్‌ఐఆర్‌డీలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయనను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, డివిజన్ బీజేపీ అధ్యక్షులు బాబురావు, మోహన్‌కుమార్, సందీప్‌ముదిరాజ్, మల్లేష్, పద్మావతి, వేణుగోపాల్, స్వప్నారెడ్డి, హేమంత్, రమాదేవి, నర్సింహ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గచ్చిబౌలి-గండి మైసమ్మ బస్సు సర్వీసు ప్రారంభం

నేటి నుంచి రూట్ నెంబర్ 221జీ రాకపోకలు

రాయదుర్గం: ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులను నడిపేందుకు గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్టీసీ డిపో చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గచ్చిబౌలి నుంచి గండిమైసమ్మ ఆలయం వరకు కొత్తగా బస్సు సౌకర్యాన్ని కల్పించేందుకు నిర్ణయించారు. డిపో మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిపో అధికారులు ఇందుకోసం సోమవారం నుంచి బస్సు సౌకర్యాన్ని అందు బాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు ప్రారంభించారు. 221జీ నెంబర్‌తో గచ్చిబౌలి నుంచి గండిమైసమ్మ ఆలయం వరకు బస్సు నడుపుతారు. గచ్చిబౌలి నుంచి ప్రారంభమయ్యే బస్సు అంజయ్యనగర్, కొండా పూర్, హఫీజ్‌పేట్, ఆల్విన్‌కాలనీ ఎక్స్‌రోడ్, మియాపూర్, మియాపూర్ ఎక్స్‌రోడ్, జేపీనగర్, మైత్రినగర్ ఎక్స్‌రోడ్, బీబీడబ్ల్యూ, మియాపూర్ డిపో, మక్తా, బొల్లారం ఐడీఏ ఎక్స్‌రోడ్, బాచుపల్లి, ఎంఎన్ఆర్ కాలేజ్, దర్గా, శ్రీచైతన్యకాలేజ్, వీఎన్ఆర్ కాలేజ్, ప్రగతినగర్ ఎక్స్‌రోడ్, కైసర్‌నగర్/డీఆర్‌కే కాలేజ్, సూరారం విలేజ్ ఎక్స్‌రోడ్, బౌరంపేట్ ఎక్స్‌రోడ్, మైల్ స్టోన్, మీదుగా గండి మైసమ్మ ఆలయం చేరుకుంటుందని డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. అదే రూట్లో తిరిగి ఈ బస్సు గచ్చిబౌలి వరకు రాకపోకలు సాగిస్తుందన్నారు. గచ్చిబౌలిలో ఈ బస్సు ఉదయం 5.30 గంటల కు ప్రారంభమవుతుండగా చివరి బస్సు రాత్రి 8.25 గంటలకు బయలు దేరుతుంది. గండిమైసమ్మ ఆలయం వద్ద ఉదయం 6.40 గంటలకు ప్రారంభమై చివరి బస్సు 9.40 గంటల కు బయలుదేరుతుంది. ఈ రూట్లోని ప్రయాణికులు ఈ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

వైద్యులు సమాజ రక్షకులు

రాయదుర్గం: వైద్యులకు సమాజ రక్షకులుగా అనాదిగా గుర్తింపు ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని హార్డ్ రాక్ కేఫ్‌లో 'ది సేవియర్స్ ఆఫ్ సొసైటీ' పేరిట ట్రిలైట్ లగ్జరీ రెసిడెన్సీస్, ది లగ్జరస్ హై రైస్ టవర్స్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే సందర్భంగా శనివారం రాత్రి పలువురు డాక్టర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో కష్టపడి పనిచేసే వైద్యులను అందరూ గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఏటా డాక్టర్ల దినోత్సవం నిర్వహించడం, వారిని సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ప్రముఖ వైద్యులు డాక్టర్ అంజలీగుల్షన్, విక్రమ్ పూసర్ల, రాజాహెగెల్‌తోపాటు పలువురిని ట్రిలైట్ లగ్జరీ రెసిడెన్సీస్, ది లగ్జరస్ హై రైస్ టవర్స్ ప్రాజెక్టు డైరెక్టర్లు జక్కిరెడ్డి సంజీవరెడ్డి, సంజయ్‌గులబాని ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంగీత కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు, ఫన్ గేమ్స్ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, పలువురు డాక్టర్లు, ప్రభుత్వ అధికారులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు



బైక్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు.

అత్తాపూర్: బీజేపీకి కార్యకర్తలే బలమని పార్టీ సీనియర్ నేత ఇలంగో అన్నారు. ఆదివారం అత్తాపూర్ డివిజన్ లాలా లజపత్ రాయ్ శక్తి కేంద్రం సమావేశం జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ రాచూరి రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగింది. సమావేశానికి తమిళనాడుకు చెందిన టి.ఇలాంగో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజశేఖర్ నాయకత్వంలో లాలా లజపత్‌రాయ్ శక్తి కేంద్రం బలోపేతమైందన్నారు. పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపు ఇచ్చిన రాచూరి విజయవంతం చేస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి నాయకుడి పని తీరును నేరుగా కేంద్ర పార్టీ గమనిస్తుందన్నారు. తమిళనాడులో ఉండే తనను ఈ శక్తి కేంద్రానికి పంపడమే ఇందుకు నిదర్శనమన్నారు. లాలా లజపత్ రాయ్ శక్తి కేంద్రం రాష్ట్ర పార్టీ దృష్టిలో ఉందని ఇప్పుడు జాతీయ పార్టీ దృష్టికి తీసుకెళ్తానన్నారు. కష్టపడి పని చేసే వారికి పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. రాచూరి రాజశేఖర్ మాట్లాడుతూ ఏ కార్యక్రమమైనా విజయవంతం కావాలంటే కార్యకర్తలే ముఖ్యమన్నారు. బీజేపీ అంటే కార్యకర్తల పరిశ్రమ, మూడు బూత్‌ల శక్తి కేంద్రానికి జాతీయ పార్టీ పరిశీలకుడిని పంపడంతో కార్యకర్తల ఉత్సాహం రెట్టింపయ్యిందన్నారు. కార్యక్రమంలో ఎస్.మల్లారెడ్డి, ఎస్.విజయ్, సాయియాదవ్, మునీందర్ పటేల్, సంతోష కొలేకర్, అంకుర్ బన్సల్, రందీర్‌సింగ్, రామమూర్తి, రఘునందన్, సుందర్, సంతోష్‌వర్మ, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ అగర్వాల్, దామోదర్ కసాట్, రాకేష్ ఠాకూర్, ఆకాష్, పూజా, కుసుం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

అత్తాపూర్: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని స్వల్పకాలిక విస్తారక్ ఆర్.టి.ఇలంగో అన్నారు. ఆదివారం అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్ అధ్యక్షతన బైక్ ర్యాలీ నిర్వహించారు. హైదర్‌గూడ చౌరస్తాలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్‌యాదవ్, కార్యదర్శి కొముర‌య్య పాల్గొన్నారు. దాదాపు 100 వాహనాలతో ఈ బైక్ ర్యాలీ కొనసాగింది. జై శ్రీరామ్, భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేస్తూ కేశవనగర్, జనప్రియ, సిరిమల్లె నగర్, న్యూ ఫ్రెండ్స్ కాలనీ, హైదర్‌గూడ, నందిముస్లాయిగూడ, మారుతీనగర్, పాండురంగానగర్, రాంబాగ్ మీదుగా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీని బూత్ నుంచి బలోపేతం చేయాలన్నారు. ప్రస్తుతం రాజేంద్రనగర్ నియోజకవర్గం, అత్తాపూర్ డివిజన్‌లో పార్టీ బలంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బుద్వేల్ పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు



బుద్వేల్ పోచమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రాజేంద్రనగర్: బుద్వేల్ గ్రామంలో పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఆదివారం దేవాలయం ఆవరణలో బోనాల ఉత్సవాల సమావేశాన్ని నిర్వహించారు. బుద్వేల్ గ్రామ దేవత పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాల సందర్భంగా దేవాలయ ఆవరణలో అభివృద్ధి కార్యక్రమాలను ముమ్మరం చేశారు. దేవాలయానికి వెళ్లేందుకు రోడ్లు సరిగ్గా లేవని అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. వీధి దీపాలు సైతం వెలగడం లేదని కొత్త వాటిని ఏర్పాటు చేయాలన్నారు. దేవాలయానికి బోనాల సందర్భంగా వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సంవత్సరం బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. బుద్వేల్‌తో పాటు చుట్టు పక్కల ప్రాంతాల భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని బోనాలు సమర్పిస్తారన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను కోరారు. సమావేశంలో దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈదమ్మ దేవాలయ పునర్‌నిర్మాణానికి తీర్మానం



సమావేశంలో పాల్గొన్న బుద్వేల్ గ్రామస్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్‌లోని ఈదమ్మ దేవాలయ పునర్‌నిర్మాణానికి గ్రామస్తులు ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఈదమ్మ దేవాలయంతో పాటు నాగదేవత దేవాలయాన్ని నిర్మించాలని ఏకగ్రీవంగా ఆమోదించారు. త్వరలో నిర్మాణ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. చరిత్రాత్మకమైన ఈ దేవాలయ నిర్మాణానికి అందరి సహాయ సహకారాలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో అల్లాడి దేవదాస్‌గౌడ్, రజనీకాంత్‌గౌడ్, చంద్రమౌళి, ఆశోక్, లోహిత్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్, శ్రీనుగౌడ్, శ్రీధర్, దాస్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాములు, నరేష్‌యాదవ్, సాయిమాలిక్, కిరణ్‌గౌడ్, ప్రసాద్, డి.కిరణ్, శ్రీను, జనార్దన్, రాములు, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపీ రంజిత్‌రెడ్డి



పీవీఆర్ భువి అపార్ట్‌మెంట్ వాసుల సమావేశంలో పాల్గొన్న ఎంపీ రంజిత్‌రెడ్డి

మణికొండ: గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలలో ఉన్న సమస్యల పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని పీవీఆర్ భువి అపార్ట్‌మెంట్‌లో నివాసితులు ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ గేటెడ్ కమ్యూనిటీకి మంచినీటి సౌకర్యం, మురుగునీరు బయటకు వెళ్లేలా డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ హైదరాబాద్ నగర శివారులో నివాసం ఏర్పాటు చేసుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, అందుకు అనుగుణంగా నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో అనేక గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లు వస్తున్నాయన్నారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి స్థానిక మున్సిపల్ ప్రజాప్రతినిధులతో పాటు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, కౌన్సిలర్ జి.శివారెడ్డి, నాయకులు గోపాల గణేష్, రాజుయాదవ్‌లతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు అవాస్తవం



సమావేశంలో పాల్గొన్న దేవాలయ కమిటీ సభ్యులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ ప్రేమావతి పేటలోని శ్రీ పాండురంగ శివాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో దేవాలయ కమిటీ సభ్యులతో పాటు గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు. గత వారం దేవాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ విషయమై చర్చించడంతో మెజార్టీ భక్తులు కమిటీకి ఆమోదం తెలపలేదన్నారు. అయితే నూతన కమిటీ ఏర్పడిందని వివిధ మాధ్యమాల్లో వస్తున్న ప్రచారం అవాస్తవమన్నారు. దేవాలయంలో జరిగే కార్యక్రమాలను మార్పులతో కూడిన పాత కమిటీ ఆధ్వర్యంలోనే కొనసాగుతాయన్నారు. గత వారం కమిటీగా ప్రకటించుకున్న వారికి దేవాలయం నుంచి ఎలాంటి గుర్తింపు లేదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని భక్తులు, ప్రజలు గమనించాలని కోరారు.

అబాకస్.. అదరహో..



శంషాబాద్: అబాకస్ ద్వారా గణితంలో మెళుకువలు నేర్చిన విద్యార్థులు తమ నైపుణ్యంతో అదరగొట్టారు. 200 లెక్కలను కేవలం 11 నిమిషాల్లో పూర్తి చేసి ఔరా అనిపించారు. సిప్ అకాడమి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రాడిజీ కార్యక్రమంలో ఒకే వేదికపై 2500 మంది 6 నుంచి 12 లోపు వయసు గల విద్యార్థులు లెక్కల చిక్కులను చకచకా విప్పేశారు. ఆదివారం శంషాబాద్ క్లాసిక్ శ్రీ కన్వెన్షన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్‌డీఓ మిస్సైల్ శాస్త్రవేత్త ఎ. రాంచంద్రరావు హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

సాన్వీని బాల పురస్కార్ అవార్డుకు సిఫార్సు చేస్తా

చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి



సాన్వీని అభినందిస్తున్న ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి

బండ్లగూడ: చిన్ననాటి నుంచే విద్యార్థుల ఆసక్తిని గుర్తించి వారికి తగిన ప్రోత్సాహం అందిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్, బాలాజీనగర్ కాలనీకి చెందిన సాన్వీ జమాల్‌పూర్ ఒలింపియాడ్‌లలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులు, ప్రశంసలు అందుకుంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఆమె బీఆర్ఎస్ నాయకుడు ప్రేమ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎంపీని కలిసింది. సాన్వీ సాధించిన అవార్డులను చూసిన ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ 9 వ తరగతి చదువుతున్న సాన్వీ అనేక అవార్డులు పొందడం అభినందనీయమన్నారు. అద్భుతమైన ప్రతిభగల ఆమెను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సాన్వీని బాల పురస్కార్ అవార్డు 2024 కోసం సిఫార్సు చేస్తామన్నారు. ఆమెను పరిగణలోకి తీసుకోవాలని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని అభ్యర్థిస్తున్నామన్నారు. తన సొంత ఖర్చుతో ఢిల్లీకి తీసుకెళ్లి స్మృతి ఇరానీని కలిసి 2024లో బాల పురస్కార అవార్డు వచ్చేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.

గురు పౌర్ణమి వేడుకలకు ఆలయాలు ముస్తాబు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ ఉప్పర్‌పల్లిలోని సాయిబాబా దేవాలయంలో గురు పౌర్ణమి మహోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. ఆషాఢ పౌర్ణమి(గురు పౌర్ణమి) సందర్భంగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. గోత్రనామాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అందంగా అలంకరించారు. గురు పౌర్ణమి మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు

మణికొండ: గురుపౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని పలు ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గండిపేట, నార్సింగిలోని సాయి సంస్థాన్‌లో ఉదయం కాగడ హారతి, నిజాభిషేకం, అలంకరణ, అర్చన, శ్రీదత్తాత్రేయ హోమం, అఖండ హారతి, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు తెలిపారు. మణికొండ, పుప్పాలగూడ సాయిబాబ దేవాలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

మణికొండ: ఔటర్‌రింగ్ రోడ్డుపై మొక్కలకు నీరు పోస్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. నార్సింగి పోలీసుల కథనం మేరకు... తెల్లాపూర్‌కు చెందిన బి.తుకారం(59)నార్సింగి కొత్త టోల్‌గేట్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డుపై ట్యాంకర్‌తో మొక్కలను నీరు పోస్తున్నాడు. అదే సమయంలో వెనకనుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం అతడిని ఢీ కొట్టడంతో కుడివైపు భుజం, ఎడమకాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108లో సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అతనితో పాటు పని చేస్తున్న గొగ్లోత్ బార్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రత్యేక పూజలు

యాకుత్‌పురా: పురానీహవేలీలోని హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టులో న్యాయశాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించారు. కోర్టు ప్రాంగణంలోని అమ్మవారి ఆలయంలో సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి రేణుకా యారా అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర న్యాయశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.సుబ్బయ్య మాట్లాడుతూ.. ఆషాఢమాసం బోనాలను పురస్కరించుకొని ప్రతి ఏడాది అమ్మవారికి బోనాలు నిర్వహిస్తున్నామన్నారు.



గోల్కొండ అమ్మవారికి బోనాలు



గోల్కొండకు వెళుతున్న కౌన్సిలర్ తదితరులు

మణికొండ: ఆషాఢమాసంలో నిర్వహించే అమ్మవార్ల బోనాలలో భాగంగా ఆదివారం నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట రాజీవ్ గృహకల్ప వాసులు గోల్కొండ జగదాంబిక అమ్మవారికి ఘనంగా బోనాలు, తొట్టెలను సమర్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ జి.శివారెడ్డి కాలనీలో తొట్టెలకు పూజలు నిర్వహించి పోతురాజుల ఆట పాటల మధ్య గోల్కొండ కోటకు చేరుకున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల నుంచి మొదలుకుని గోల్కొండ అమ్మవారికి ప్రతి సంవత్సరం పూజలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో గృహకల్ప వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప బోనాలు

శంషాబాద్: పట్టణంలోని రాళ్లగూడలో బీరప్ప బోనాలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక ప్రజలు బీరప్ప ఆలయం పెద్ద ఎత్తున బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజల్లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్, నార్సింగి ఏఎంసీ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్, సీనియర్ నాయకులు ఆర్. గణేష్‌గుప్తా, కౌన్సిలర్, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



బోనాలు సమర్పిస్తున్న మహిళలు

పార్టీ కార్యక్రమాలకు కార్పొరేటర్‌ను పిలవరా..?

అత్తాపూర్ కార్పొరేటర్ మొండ్ర సంగీతగౌరీశంకర్



అత్తాపూర్: భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, ప్రజల మద్దతుతో కార్పొరేటర్‌గా విజయం సాధించానని, డివిజన్ స్థాయిలో అందరినీకలుపుకుని వెళితేనే విజయం సాధ్యమైందని కానీ ప్రస్తుతం కొందరు నాయకుల తీరు సరిగ్గా లేదని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మొండ్ర సంగీతగౌరీశంకర్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్టీ ఏ కార్యక్రమం నిర్వహించినా కార్పొరేటర్ దృష్టికి తీసుకురాకపోవడం దారుణమన్నారు. తనకు కనీస సమాచారం అందించడం లేదని అత్తాపూర్ డివిజన్‌కు విస్తారక్‌గా వచ్చిన ముఖ్యమైన నేత, నాయకులు కార్పొరేటర్‌ను సంప్రదించకుండానే డివిజన్‌లో పార్టీ కార్యక్రమాలు చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. వారి వైఖరి ఇలాగే కొనసాగితే పార్టీ రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళతానన్నారు. డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని, డివిజన్ అభివృద్ధికి శాయశక్తుల తోడ్పడుతున్నామన్నారు. తన పనితీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. కొందరు నేతలు స్వలాభం కోసం బీసీ మహిళననే వివక్షతోనే తనను సంప్రదించకుండానే పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర నాయకత్వం అందరినీ కలుపుకుని పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని సూచిస్తున్నా అందుకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకుని కార్పొరేటర్‌కు ఇవ్వాల్సిన గౌరవాన్ని ఇవ్వాలన్నారు.

సీఐటీయూ జీపు జాతాను విజయవంతం చేయండి



కాటేదాన్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జూలై 4 నుంచి 13 వరకు సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జీపు జాతా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ కాటేదాన్ క్లస్టర్ కన్వీనర్ రుద్రకుమార్, కోశాధికారి భాస్కర్ తెలిపారు. ఆదివారం కాటేదాన్ క్లస్టర్ కమిటి ఆధ్వర్యంలో జీపు జాతా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో పని చేస్తున్న కార్మికులకు గత 15 సంవత్సరాలుగా కనీస వేతనాలు సవరించడం లేదన్నారు. కాల పరిమితి ముగిసిన జీవోలను మార్చి పెరిగిన ధరలకు అనుగుణంగా కొత్త జీవోలను విడుదల చేయాలనే డిమాండ్‌తో ఈ జీపు జాతా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాటేదాన్ క్లస్టర్‌లో ఉన్న కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ సచిన్, దత్తు, శశికాంత్, సునీల్, మహమ్మద్ భాషా, వెంకటయ్య, స్వామి, రాజు, రషీద్‌భాయ్, చాంద్‌భాయ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో మహిళాభ్యున్నతికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి



రాజేంద్రనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో సమావేశంలో పాల్గొన్న నాయకులు

రాజేంద్రనగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి ఎన్నో పథకాలను అమలు చేస్తుందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాటేదాన్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉడుత లక్ష్మి ఆధ్వర్యంలో డివిజన్ మహిళా మోర్చా సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీనా, తమిళనాడు రాష్ట్ర ఉప అధ్యక్షులు, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ విస్తారక్ లోగేంద్రన్, డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ మహిళల కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి ప్రతి ఒక్కరికీ అందేలా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షులు అడికే జనార్ధన్, మహిళా మోర్చా ముఖ్య నాయకులు వి.లక్ష్మి, శరణమ్మ, తిరుపతమ్మ, విమలమ్మ, నవనీత, సుధా తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

రాజేంద్రనగర్: భారతీయ జనతా పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని తమిళనాడు ఇన్‌చార్జీ విస్తారక్ మోహన్ కుమార్ అన్నారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో మహిళా మోర్చా అధ్యక్షురాలు గడీల పద్మావతి అధ్యక్షత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా కమిటీ నియామకం, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో రంగారెడ్డి(అర్బన్) జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు బాబురావు, ప్రధాన కార్యదర్శి సందీప్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి స్వప్నరెడ్డి, ఉపాధ్యక్షురాలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆటో మొబైల్ దుకాణంలో అగ్నిప్రమాదం





కాలిపోతున్న మెకానిక్ షెడ్డు, ఆటో మొబైల్ షాప్

శంషాబాద్: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఆటో మొబైల్ దుకాణంతో పాటు మెకానిక్ షెడ్ అగ్నికి ఆహుతైన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా గత కొన్ని నెలలుగా ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద సంఖ్యలో మెకానిక్ షెడ్లతో పాటు ఆటోమొబైల్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ఆటో మొబైల్ దుకాణంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. మంటలు పక్కనే ఉన్న మెకానిక్ షెడ్డుకు వ్యాపించడంతో షెడ్డు తగలబడిపోయింది. సమాచారం అందుకున్న ఆర్‌జీఐఏ పోలీసులు ఫైర్ ఇంజిన్లను రప్పించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.